క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తున్నాం

వీబీఐటీ ప్రిన్సిపాల్ పీవీఎస్.శ్రీనివాస్



వీబీఐటీ ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్

ఘట్‌కేసర్: వీబీఐటీలో విద్యార్థినుల ఫొటోలు వార్డెన్ తీశారని చేసిన ఆరోపణలు అవాస్తవమని, కొందరు ప్రైవేటు వ్యక్తులు కావాలనే కళాశాల పేరును అప్రతిష్ఠపాలు చేశారని ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. ఫొటోల ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిధులు విద్యార్థినులతో కూలంకషంగా మాట్లాడి, విచారణ చేపట్టి ఎలాంటి ఘటన జరగలేదని తేల్చారన్నారు. ఆధారాలు లేకుండా అసత్యప్రచారం చేయడం, వివాదాన్ని సంచలనాత్మకంగా చేయడం బాధాకరమన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను పారదర్శకంగా బోధిస్తామని, విద్యార్థుల శ్రేయస్సే మాకు ప్రధానమన్నారు. అసత్యప్రచారాలు నమ్మొద్దని సూచించారు.

వాహన తనిఖీలు



నెంబర్ ప్లేట్లు లేని వాహనాలతో యజమానులు

ఘట్‌కేసర్: రాచకొండ సీపీ ఆదేశానుసారం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లులేని 10 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాల యజమానులతో నెంబర్ ప్లేట్లు తెప్పించి బిగింపజేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ పరశురాం మాట్లాడుతూ.. వాహనాలకు నెంబర్ ప్లేటు లేకుండా నడపరాదని, వాహనం ముందు, వెనకాల తప్పనిసరిగా నెంబర్ ప్లేటు ఉండేలా చూసుకోవాలన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి పద్మిని

ఘట్‌కేసర్: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా మండల పశువైద్యాధికారి పద్మిని నివారణ టీకా (ఎఫ్‌ఎండీ)ను ఘట్‌కేసర్‌లో సోమవారం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి అభివృద్ధికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీకాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధితో పశువులు బలహీనపడి మృత్యువాత పడతాయన్నారు. కాగా 181 పశువులకు టీకా వేశామన్నారు. వైద్య సిబ్బంది గణేష్‌ముదిరాజ్, అన్నదాతలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టాలని వినతి



ఎమ్మెల్సీ కోదండరాంతో ఉపాధ్యాయులు

మల్లాపూర్: ఉపాధ్యాయులను ఏపీ, తెలంగాణ అంతర్రాష్ట్ర బదిలీలు జరిపించాలని కోరుతూ పలువురు ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ కోదండరాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 11 ఏళ్లుగా అంతర్రాష్ట్ర బదిలీలు లేక కుటుంబాలకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమగోడు వెళ్లబోసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి వేసవిసెలవుల్లో ఉత్తర్వులు ఇప్పించాలని వేడుకున్నారు. సాధ్యమైనంత త్వరగా బదిలీలు జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇక్బాల్, వేణుమాధవ్, జోష్ విక్టర్, విజయ, లలితాదేవీ, సుజాత, విజయ, జయంతి తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మల్లాపూర్: ఉప్పల్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి రూ.1.74 కోట్లు మంజూరయ్యాయని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పెర సాయికిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్లాపూర్ బ్రహ్మపురి కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొప్పెర సాయికిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీరప్పగడ్డ నుంచి మనిక్‌చంద్‌చౌరస్తా వరకు బీటీరోడ్డు, వెంకటరమణ కాలనీలో సీసీరోడ్డు, బ్రమపురి కాలనీలో సీసీరోడ్డు, సింగంచెరువు తండాలో శ్మశానవాటికలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..
ఎండుతున్న మొక్కలు !

> మండుతున్న ఎండల నేపథ్యంలో మొక్కల సంరక్షణపై అటవీ, పంచాయతీ శాఖలు, పురపాలక సంఘాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంతో నాటిన మొక్కలు వాడిపోతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ లక్ష్యం నీరుగారకముందే.. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.
>
> – సాక్షి,సిటీబ్యూరో



- పల్లె, పట్టణ ప్రకృతి వనాలకు సంరక్షణ కరువు
- ఏటా లక్షల్లో మొక్కలు నాటుతున్నా, పెంచడంపై అశ్రద్ధ
- అటవీ, పంచాయతీ, పురశాఖలు నిర్లక్ష్యం వీడాలంటున్న ప్రజలు

స్పెషల్ పాలనలో సంరక్షణేది..?

పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. స్పెషల్ ఆఫీసర్లు మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో సిబ్బంది వాటి అలనా, పాలనా చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయి తప్పా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. మొక్కలు నాటేటప్పుడు ఉంటున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో కనిపించడం లేదు. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో వ్యయం చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా వదిలేయడం ద్వారా ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలున్నాయి.

మొక్కల పెంపకానికి....

నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ.1.20 చెల్లిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు చెల్లిస్తున్నారు. రక్షణ కంచెకు రూ.6 వరకు, నీరు పోసేందుకు రూ.3 చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. పంచాయతీ, పట్టణాలకు వచ్చే నిధులు, ఇతర గ్రాంట్స్ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు.

పల్లె, పట్టణ ప్రకృతి వనాల్లోనూ..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగరవాసులకు పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా, నిర్వహణలో తలెత్తిన నిర్లక్ష్యం వల్ల పచ్చదనాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నాయి.

- శామీర్‌పేట మండలంలో 10 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉండగా.. ఘట్కేసర్ మండలంలో 18, కీసర మండలంలో తొమ్మిది, మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్ మండలంలో 22 పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. ఈ పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, పంచాయతీ, డీఆర్‌డీఏ పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, శ్రద్ధను కనబరచడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- 5 మండలాల్లోని కాచవానిసింగారం, బొమ్మరాసిపేట్, శ్రీరంగవరం, చీర్యాలలో పదెకరాలోపు ఉన్న ప్రభుత్వ భూముల్లో నాటిన సంపద వనాల నిర్వహణలోనూ ఇదే తంతు కొనసాగుతోంది.

పర్యవేక్షణ కొరవడి...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరందడం లేదు. మూడుచింతలపల్లి, ఉద్దమర్రి, కేశవరం, అలియాబాద్, మజీద్‌పూర్, ఏదులాబాద్, కొర్రెముల, రావల్‌కోల్, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లిల్లో మొక్కలకు నీటి నిర్వహణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి.

- 13 పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితితో మొక్కలు వాడిపోతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్‌డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఉగ్రదాడి మృతులకు నివాళి



నాగారం శాంతిర్యాలీలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

మేడ్చల్: కశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల చేతిలో బలైన అమరులకు మేడ్చల్‌లోని ప్రజలు నివాళులర్పిస్తున్నారు. పార్టీలకు అతీతంగా రోజూ సాయంత్రం ఏదో ఒక ప్రాంతంలో రాజకీయాలకు అతీతంగా నివాళులర్పిస్తున్నారు. పాకిస్తాన్‌కు కేంద్రం సరైన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని 14వ వార్డులోని బాలాజీనగర్, ఎంఆర్‌ఆర్ కాలనీలతో పాటు వివిధ కాలనీల అసోసియేషన్లు క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి నాయకులు పవన్, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

కీసరలో కొవ్వొత్తుల ర్యాలీ..

కీసర: జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ నాగారంలోని సత్యనారాయణ కాలనీలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకురాలని, ఈ హింసాకాండకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నేతలు బిజ్జశ్రీనివాస్‌గౌడ్, రాహుల్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులున్నారు.

పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన అవసరం



ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


రాంగోపాల్‌పేట్: పోలీసులకు సీపీఆర్, ప్రాథమిక చికిత్సపై అవగాహన ఎంతో అవసరమని ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రిలో ఉత్తర మండలంలోని ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్, ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది రోడ్డుపైన వెళ్లే ప్రజలు అకస్మాత్తుగా గుండెపోటుకు గురికావడం, ప్రమాదాల బారిన పడటం జరుగుతుందన్నారు. విధుల్లో ఉండే పోలీసులకు వీటిపై అవగాహన ఉంటే ఇలాంటివి జరిగినపుడు సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు, వడదెబ్బ జరిగినపుడు కూడా ప్రాథమికి చికిత్సలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ఆస్పత్రి డీజీఎం హరిప్రసాద్, డాక్టర్ అలీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఉపశంకర్, వెంకటరాములు, మధు, పాపయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) యువజన పరిషత్ యూనియన్ 32వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను సోమవారం ఈసీఐఎల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అజ్మీర్ వీరునాయక్ మాట్లాడుతూ.. ఈసీఐఎల్‌లో చాలారోజులుగా ఉద్యోగ నియామకాలు జరగడం లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే యజమాన్యంతో యువజన పరిషత్ ఆధ్వర్యంలో చర్చలు జరిపినట్లు వివరించారు. త్వరలోనే 30–50 మంది కార్మికులను కొత్తగా విధుల్లోకి తీసుకునే అవకాశముందన్నారు. గత ఐదేళ్లుగా సంస్థ లాభాల బాటలో నడుస్తుందని, కార్మికుల సమష్టి కృషితోనే అది సాధ్యమైందన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఆర్. సుందర్ లాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ హైదర్‌అలీ, ప్రవీణ్, రమేష్, సుఖాంజన, సమీర్, సోనాబాయి, భీమ్‌రావు, వెంకటేష్, కరణ్‌సింగ్, కోటేశ్వరరావు, ఆర్.రమేష్, రవి తదితరులున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు !

మౌలాలి: మౌలాలి కమాన్ సమీపంలోని గోపాల్‌నగర్ నుంచి లైఫ్ స్ప్రింగ్ ఆసుపత్రి వరకు చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలతో ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నట్లు జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సీసీరోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారని, అందువల్ల ఏప్రిల్ 27 నుంచి మే 26 వరకు జెడ్‌ఆర్టీఐ సిగ్నల్ నుంచి రమాదేవి వరకు వయా మౌలాలి కమాన్ రోడ్డును తాత్కాలికంగా మూసివేస్తున్నామన్నారు. తార్నాకా నుంచి ఈసీఐఎల్ వెళ్లేవారు జడ్‌ఆర్టీఐ సిగ్నల్ వద్ద కుడివైపు తిరిగి హెచ్‌బీకాలనీ ఎన్టీఆర్ విగ్రహం మీదుగా రమాదేవి ఆసుపత్రి వరకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈసీఐఎల్ నుంచి తార్నాకా వెళ్లే వాహనదారులు రమాదేవి సిగ్నల్ వద్ద ఎడమవైపు తిరిగి ఎన్టీఆర్ విగ్రహం నుంచి హెచ్‌బీకాలనీ గుండా జెడ్‌ఆర్టీఐ సిగ్నల్ వరకు వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. వాహనదారులు దీనికి సహకరించాలని ఆయన కోరారు.



దారి మళ్లించిన రూట్ మ్యాప్



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన మందుముల పరమేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి చేరికలు

రామంతాపూర్: డివిజన్ నేతాజీనగర్‌కు చెందిన పలువురు యువకులు టీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సోమవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజల సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆరు గ్యారంటీల పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషిచేసే వారికి పదవుల నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. గౌతమ్‌కిరణ్, సాయి, గైక్వాడ్, కిషోర్, విజయ్, శరత్, అశ్విన్, ప్రవీణ్, రూపేష్, రోహిత్, సాత్విక్, వినయ్, బన్నీ, చింటూ, మహి, పవన్, మహేందర్, శివ తదితరులున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలకు సంబంధించిన 68 అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) హరిప్రియ స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా వినతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు,బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూ కబ్జాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లు తదితర వాటిపై కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, శామీర్‌పేట్ మూడుచింతపల్లి మండలాల్లోని 34 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు బకాయిలు 5 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయితీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయితీ కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ హరిప్రియకు అందజేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, గ్రామపంచాయితీ కార్మికుల సంఘం నాయకులు సుధాకర్, ఆరోగ్యం, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ కార్మికులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి...

సాక్షి,సిటీబ్యూరో: నిజాంపేట్ ,దుండిగల్, దమ్మాయిగూడ పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు 3 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తాకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఉన్నికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా విజయగణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఆలయ బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఈసీనగర్‌లోని విజయగణపతి ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, ఆల్వా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై వినతి..

- చర్లపల్లి డివిజన్, వీఎన్‌రెడ్డినగర్ కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యపై కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరన్న, ప్రధాన కార్యదర్శి కనకరాజుగౌడ్ తదితరులున్నారు.

వేతన వెతలు !

- పంచాయతీ కార్మికులకు 5 నెలలుగా రాని జీతాలు
- పురపాలక సంఘాల కార్మికులకు సైతం చెల్లించని వైనం
- అధికారులకు విన్నవించినా.. కానరాని ఫలితం
- శివారులోని కార్మిక కుటుంబాలకు తప్పని తిప్పలు

సాక్షి, సిటీబ్యూరో: పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందకపోగా.. పురపాలిక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలలు వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

పంచాయతీల్లో ఇలా..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు అర్ధాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంటి అద్దెలతో సహా నిత్యావసర సరుకులు కూడా కొనలేని పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూతన పంచాయతీ చట్టం ప్రకారం..

నూతన చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు నెలనెలా వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటోంది. గ్రామపంచాయతీ ఆర్థిక వనరుల నేపథ్యంలో 5 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం.

34 గ్రామ పంచాయతీల్లో..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లో 34 గ్రామ పంచాయతీల్లో 600 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.9.500 చొప్పున రూ.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

పురపాలక సంఘాల్లోనూ...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల పరిధిలో 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తుండగా, వీరికి కూడా అరకొరగా వేతనాలు అందజేస్తున్నారు. ప్రతినెల 10వ తేదీ వరకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడిచినా అందజేయకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాలతో సహా ఇంటి అద్దెలు, తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు కూడా చేతుల్లో చిల్లిగవ్వలేక నానా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని అతిపెద్ద పురపాలకసంఘం నిజాంపేటతో సహా దుండిగల్, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మిగతా 10 పురపాలక సంఘాల్లో కూడా నెలనెలా వేతనాలు రావడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి..

ప్రజావాణిలో రాత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఫలితమేమి లేదని, పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని వేతనాలు సకాలంలో అందజేయడం ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు, సిబ్బంది కోరుతున్నారు.

